క్లుప్తంగా

మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభించిన ఎమ్మెల్యే


వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: మండలంలోని ఊలపల్లి గ్రామంలో ఫార్మా జల్ కంపెనీ వారి రూ.10 లక్షల ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్లాంట్ ఏర్పాటుకు కృషి చేసిన ఫార్మా జెల్ కంపెనీ ప్రతినిధుల్ని, కనెక్ట్ టు ఆంధ్ర సీఈవో కొట్ల శివశంకర్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ళ కృష్ణారెడ్డి, ఎంపీటీసీ బండారు శివ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాతుల ప్రసాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దాడిపై కేసు నమోదు

సీతానగరం: సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర పోస్టులు పెడతున్నాడంటూ సీతానగరానికి చెందిన ఆకుల లక్ష్మణరావుపై మట్ట నాని, ముత్యాల హరీష్, ముత్యాల మహేష్‌తో పాటుగా మరికొందరు స్థానిక బస్టాండ్ సమీపంలో కర్రలతో దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెడ్‌కానిస్టేబుల్ లోవకుమార్ తెలిపారు.

శ్రీనివాసరావుకు సన్మానం


శ్రీనివాసరావును సన్మానిస్తున్న ప్రముఖులు

సీతానగరం: పురుషోత్తపట్నం పంచాయతీ పరిధిలోని రామచంద్రపురానికి జొన్నలగడ్డ శ్రీనివాసరావు గౌరవ డాక్టరేట్ సాధించిన సందర్భంగా సోమవారం వైఎస్సార్ సీపీ నాయకుడు, మండల ప్రత్యేక సలహాదారుడు చల్లమళ్ల సుజీరాజు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రైతులు, యువకులు పాల్గొన్నారు. ఇటీవల ఇంటర్నేషనల్ ఆస్ట్రాలజీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో థాయ్‌లాండ్‌లో నిర్వహించిన యూఎస్‌ఏ, ఇండియా, థాయ్‌లాండ్ ట్రయాంగిల్ సదస్సులో జీవీఎంసీ 8వ వార్డు ఎండాడకు చెందిన జొన్నలగడ్డ శ్రీనివాసరావుకు ఇండియా, థాయ్‌లాండ్ పురస్కారంతో పాటు పాటు వాస్తు బృహస్పతి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు.

ప్రాచీన ఆలయాల సందర్శన

బిక్కవోలు: బిక్కవోలు మండలంలోని ప్రాచీన ఆలయాలను హార్టికల్చర్ కమిషనర్ డాక్టర్ ఎస్ఎస్ సుధీర్, మాధవి దంపతులు దర్శించుకున్నారు. సోమవారం బిక్కవోలు శ్రీలక్ష్మీగణపతి, కుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు స్వామివారి జ్ఞాపిక అందించారు. కార్యక్రమంలో హార్టికల్చర్ డీహెచ్‌వో రాధాకృష్ణ, పీడీ రామ్మోహన్‌రావు, జంగా వీర వెంకట సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్‌కు ఆటల పోటీలు


భోగిమంట చుట్టూ తిరుగుతూ కీర్తనలు పాడుతున్న సీనియర్ సిటిజన్స్

రంగంపేట: కోడి పందేలు, జూద క్రీడలకు భిన్నంగా మండల పరిధిలోని మర్రిపూడి గ్రామంలో సంక్రాంతి రోజున సీనియర్ సిటిజన్స్‌కు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 67 సంవత్సరాల నుంచి 92 సంవత్సరాల వయసున్న 25 మందికి ప్రవేశం కల్పించారు. ముందుగా సీనియర్ సిటిజన్ రిమ్మలపూడి కృష్ణమూర్తి కేక్‌కట్ చేసి క్రీడాకారులకు అందజేశారు. భోగి మంట చుట్టూ క్రీడాకారులు మానవహారంగా ఏర్పడి హరినామ సంకీర్తన చేశారు.

అనంతరం బరువులు విసరడం, బెలూన్లు ఊదడం, ఎడమ చేతితో అగ్గిపుల్లలు వెలిగించడం, అరచేతిపై నిమ్మకాయలు నిలిపి ఉంచడం, టబ్‌లోకి బంతి విసరడం, నడక, తాడులాగే పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయుడు పుట్టా వెంకట్రావు ఆధ్వర్యంలో వ్యవసాయ రంగంపై క్విజ్ పోటీ నిర్వహించారు. చివరగా 92 సంవత్సరాల వయసులోను నిత్యం సైకిల్ తొక్కే పుట్టా అచ్చియ్య, బస్తాలు, నీళ్లకావిడిలు మోయగలుగుతున్న మోదుకూరి తాతారావు, పుట్టా నారాయణరావులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమాన్ని రంగంపేట మండల సాగునీటి సాధన కమిటీ కన్వీనర్ పుట్టా సోమన్నచౌదరి నిర్వహించారు.

వైభవంగా వీరుళ్లమ్మ జాతర

జాతరకు పోటెత్తిన జనం


విద్యుత్ దీపాలంకరణతో కాంతులీనుతున్న అనపర్తి మెయిన్ రోడ్డు

అనపర్తి: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా భక్తులు కొలిచే అనపర్తి వీరుళ్ళమ్మ జాతర ఆదివారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. రాత్రి 9 గంటలకు ప్రారంభమైన జాతర సోమవారం వేకువజాము వరకు కొనసాగింది. అనపర్తి, మండపేట, రాజానగరం, పెద్దాపురం, తదితర నియోజకవర్గాలతో పాటు జాతరను తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి అశేషంగా తరలి వచ్చిన జనంతో స్థానిక దేవీచౌక్-రైల్వే స్టేషన్ రోడ్డు, వేమగిరి-సామర్లకోట కెనాల్ రోడ్డులు కిక్కిరిసిపోయాయి. ఈ సందర్భంగా వేలాది సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి, నైవేద్యాలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులతో క్యూలైన్లు నిండిపోయాయి. జాతర సందర్భంగా తమ చిన్నారులను కాచి కాపాడాలని కోరుతూ తల్లిదండ్రులు తమ పిల్లలతో ఆలయ ఆవరణలో కాగడాలు వెలిగించారు. జాతరలో భాగంగా ఏర్పాటు చేసిన గారడి విద్యలు, నవదుర్గలు, కాళికా వేషాలు, చైనా బొమ్మలు, పులివేషాలు, శివకాళీ నృత్యం, మ్యూజికల్ బ్యాండ్, తీన్‌మార్ డప్పులు, గరగ నృత్యాలు, కోయ, నెమలి డాన్సులు, సంగీత విభావరి కార్యక్రమాలతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మణికంఠ ట్రేడ్ ఫెయిర్ ఎగ్జిబిషన్, విశాఖ జిల్లా


జాతరలో అలరించిన కాళికా వేషధారణలు

నర్సీపట్నం జంగాలపల్లికి చెందిన రాజా లైటింగ్ అండ్ డెకరేషన్ వారు ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. స్థానిక దేవీచౌక్ నుంచి రైల్వే స్టేషన్ వరకు, మెయిన్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న ప్రధాన వీధుల్లో వివిధ దేవతామూర్తుల ఆకృతుల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణలు ఆకట్టుకున్నాయి.


ఆలయ ఆవరణలో చిన్నారులతో కాగడాలు వెలిగిస్తున్న తల్లిదండ్రులు

ఆలయం వద్ద సుమారు 80 అడుగుల ఎత్తులో విద్యుత్ దీపాలతో ఏర్పాటు చేసిన అయోధ్య రామమందిరం, వెనుక వైపు ఆర్ఆర్ఆర్ సినిమాకు సంబంధించిన సన్నివేశాలతో కూడిన సెట్టింగ్‌లు కనువిందు చేశాయి. జాతరలో భాగంగా ప్రతిష్ఠాత్మకంగా జరిగిన బాణసంచా పోటీలు వీక్షకులకు వినోదాన్ని పంచాయి.

కాపాడమ్మా..గొల్లాలమ్మా..


గొల్లాలమ్మ గ్రామోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: చిన్నారులను కాచి కాపాడే చల్లని తల్లిగా శతాబ్దాలుగా మండలంలోని రామవరం, పరిసర గ్రామ ప్రజల పూజలందుకుంటున్న రామవరం గ్రామ దేవత గొల్లాలమ్మ అమ్మవారి జాతర సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. జాతరలో భాగంగా మూడు నెలల ముందుగా అమ్మవారిని గ్రామంలోకి తీసుకొచ్చి స్థానిక శివాలయం సమీపంలోని నడివీధిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆవాసంలో అమ్మవారిని కొలువుతీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంక్రాంతి రోజున అమ్మవారికి జాగారం, కనుమ రోజున నైవేద్యాలు, ముక్కనుమ రోజున అమ్మవారికి సంబరం నిర్వహించి సాగనంపుతారు. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. చిన్నారులను అమ్మవారి పాదాల వద్ద ఉంచి అమ్మ దీవెనలు పొందారు. ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, మారిటైం బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి, ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సత్తి సుబ్బిరెడ్డి, పారిశ్రామికవేత్తలు మేడపాటి రామలింగారెడ్డి, కోనాల సూర్యనారాయణరెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు.

వైభవంగా భక్తాంజనేయ స్వామి సంబరం

కుతుకులూరులో కొలువై ఉన్న భక్తాంజనేయ స్వామి సంబరం సోమవారం రాత్రి కన్నుల పండువగా నిర్వహించారు. గ్రామంలో ప్రధాన రహదారి, వీధుల్లో విద్యుత్ దీపాలతో ఏర్పాటు చేసిన భారీ సెట్టింగ్‌లు, విద్యుత్ దీపాలంకరణలు ఆకట్టుకున్నాయి. కుతుకులూరు పరిసర గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, గ్రామానికి చెందిన డిప్యూటీ డైరెక్టర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(చెన్నై) కర్రి రామ్‌గోపాల్‌రెడ్డి తదితరులు స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

ఘనంగా సత్తెమ్మ తల్లి సంబరం

బిక్కవోలు: బలభద్రపురంలో సత్తెమ్మతల్లి సంబరం ఘనంగా నిర్వహించారు. ఆదివారం అమ్మవారి ప్రత్యేక పూజలు చేసి అనంతరం గరగ నృత్యాలు, శక్తి వేషాలు నిర్వహించారు. కార్యక్రమంలోని భక్తులు విశేషంగా పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు


చక్రద్వారబంధంలో ముగ్గుల పోటీ విజేతలకు బహుమతి ప్రదానం


పురుషోత్తపట్నంలో కబడ్డీ విజేతలకు బహుమతులు అందిస్తున్న రామకృష్ణ పరమహంస దంపతులు

సీతానగరం: బెంగళూరులోని ఏఎంసీ విద్యాసంస్థల అధినేత కల్లూరి రామకృష్ణ పరమహంస, గీత దంపతుల ఆధ్వర్యంలో పురుషోత్తపట్నంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. వారు తమ కుమార్తె మోనిక, కుమారుడు రాహుల్‌తో పాటు కుటుంబ సభ్యులతో ప్రతి ఏడాది సొంతూరు పురుషోత్తపట్నం వచ్చి సంక్రాంతి పండగను అత్యంత వైభవంగా జరుపుకొంటారు. ఈ ఏడాదీ అలాగే పండగ సంబరాలు నిర్వహించారు. ముగ్గుల పోటీలు, స్లో సైకిలింగ్, సంప్రదాయ వస్త్రధారణతో ఫ్యాషన్ షో, మ్యూజికల్ నైట్, కోలాటం నిర్వహించారు. గ్రామంలో క్రీడాకారులను ప్రోత్సాహించే విధంగా కబడ్డీ పోటీలు జరిపారు. విజేతలకు బహుమతులతో పాటు పాల్గొన్న వారందరికీ కన్సోలేషన్ బహుమతులు ఇచ్చారు. కల్లూరి పరమహంస ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండు వందల మంది వృద్ధులకు రూ.200 నగదు, నూతన వస్త్రాలను అందించారు.

ముగ్గుల పోటీలు

రాజానగరం: చక్రద్వారబంధంలోని దేవీచౌక్ వద్ద కనుమ పండగ సందర్భంగా సోమవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. సీతారామాంజనేయ బాలభక్త భజన సమాజం ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలలో కానవరానికి చెందిన నాగేశ్వరి, తోకాడకు చెందిన రాజకుమారి, చక్రద్వారబంధానికి చెందిన నాగదేవి, రాధేయపాలెంకు చెందిన లక్ష్మి బహుమతులు గెలుచుకున్నారు.

ప్రజల మనోభావాలను గౌరవించరా?

ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి


ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డితో మాట్లాడుతున్న డీఎస్పీ భక్తవత్సలం

అనపర్తి: ప్రజల మనోభావాలను ప్రజాప్రతిధులతో పాటు ప్రభుత్వ ఉద్యోగులూ గౌరవించాల్సి ఉంటుందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. సోమవారం అనపర్తిలో వీరుళ్లమ్మ తీర్థం సందర్భంగా సంప్రదాయబద్ధంగా జరుగుతున్న కార్యక్రమాలను పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో అక్కడ ఉన్న ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ ప్రతినిధులు పోలీసుల చర్యలను నిలువరించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఆలయ ప్రాంగణం వద్ద ఘర్షణ వాతావరణం ఏర్పడింది. విషయం తెలుసుకుని అక్కడికి చేరుకున్న ఎమ్మెల్యే పోలీసులతో మాట్లాడుతూ తీర్థాలు, జాతరలు సంస్కృతి సంప్రదాయాల్లో ఒక భాగంగా వస్తున్నాయని, ప్రజల మనోభావాలతో ఇవి ముడిపడి ఉంటాయన్నారు. వీరుళ్లమ్మ జాతరతో పాటు మండలంలోని కుతుకులూరులోని ఆంజనేయస్వామి జాతర సంప్రదాయాన్ని ఆయా గ్రామాల ప్రజలు అనాదిగా నిర్వహిస్తూ వస్తున్నారన్నారు. దీంట్లో ఏ విధమైన స్వార్థ ప్రయోజనాలు లేవని తెలిపారు. ఈ విషయంలో పోలీసులు ప్రవర్తిస్తున్న తీరును విమర్శించిన ఎమ్మెల్యే ఈ వ్యవహారంలో అరెస్టులు చేయదలిస్తే ముందుగా తనను అరెస్ట్ చేయాలన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణానికి చేరుకున్న ఈస్ట్ జోన్ డీఎస్పీ భక్తవత్సలం ఈ వ్యవహారంపై ఎమ్మెల్యేతో చర్చించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక


జి.మామిడాడ శివారు లక్ష్మీనర్సాపురంలో పూర్వ విద్యార్థుల కలయిక


కొంకుదురులో కలుసుకున్న 1994-95 బ్యాచ్ విద్యార్థులు

పెదపూడి: జి.మామిడాడ శివారు లక్ష్మీనర్సాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2002-2003 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సమావేశంలో అప్పట్లో తమకు పాఠాలు బోధించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.వీర్రాఘవరెడ్డి, కె.ఆదిరెడ్డి, ఇతర ఉపాధ్యాయులను పూలమాలలు వేసి, శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. పదో తరగతి చదివి రెండు దశాబ్దాలు పూర్తయిన సందర్భంగా ఈ ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటుచేశామని పూర్వ విద్యార్థులు తెలిపారు. ఒకరికొకరు పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుని రోజంతా ఉత్సాహంగా గడిపారు. తాము ఎక్కడున్నా పాఠశాలలో చదువుకునే పేద విద్యార్థులకు సహకారమందిస్తామని, పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామని పూర్వ విద్యార్థులు ప్రకటించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

బిక్కవోలు: దశాబ్దాల క్రితం చదువులమ్మ చెట్టు నుంచి ఎగిరి పోయిన స్నేహితులనే పక్షులు సుదీర్ఘ విరామం తర్వాత తిరిగి అదే చెట్టు నీడన సేద తీరి గత స్మృతులను నెమరవేసుకున్నారు. కొంకుదురులోని కొవ్వూరి సత్తిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1994-95 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు దాదాపు మూడు దశాబ్దాల అనంతరం కలుసుకున్నారు. అంతా కలిసి చదువుకునే రోజుల నాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకురాలు రొంగల పద్మావతి, వెలగల వీర్రాఘవరెడ్డి, పడాల వెంకటరామారెడ్డి, రవీంద్రరెడ్డి, తేతలి బృందావతి తదితరులు పాల్గొన్నారు.

సేవతోనే సంతృప్తి

ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి


వృద్ధులకు నూతన వస్త్రాలు, దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: పేదలకు సహాయం చేయడం ద్వారానే ఆత్మ సంతృప్తి, మానవ జన్మకు సార్థకత చేకూరుతాయని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. సంక్రాంతిని పురస్కరించుకుని స్థానిక పాత ఊరు బాపనమ్మ వారి ఆలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమాల్లో సుమారు 900 మంది పేదలు, వికలాంగులు, వృద్ధులకు నూతన వస్త్రాలు, దుప్పట్లు ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తోటి వారికి సహాయపడాలన్న ఆలోచనతో ఇటీవల కాలంలో అనేక మంది స్వచ్ఛందంగా ముందుకొచ్చి సేవా కార్యక్రమాలు నిర్వహించటం హర్షణీయమన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ సేవా తత్పరతను అలవరచుకొని సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించటం ద్వారా సమాజాభివృద్ధి సాధ్యపడుతుందని చెప్పారు. ఈ సందర్భంగా అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో తేతలి త్రినాథరెడ్డి, మల్లిడి వీర్రాఘవరెడ్డి, మల్లిడి సునీల్‌రెడ్డి, తేతల సోమశేఖరరెడ్డి, సత్తి శివశంకర్‌రెడ్డి, తేతలి సాయిసురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ రవాణాకు అడ్డుకట్ట


బూరుగుపూడి జంక్షన్‌లో కలప వాహనాలను తనిఖీ చేస్తున్న అటవీశాఖ సిబ్బంది

మధురపూడి: కలప, ఇతర విలువైన సంపద అక్రమంగా రవాణా కాకుండా అరికట్టేందుకు అటవీ శాఖ చర్యలు తీసుకుంది. దాన్ని అడ్డుకట్ట వేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసింది. ఇందులో భాగంగా కోరుకొండ మండలం బూరుగుపూడి జంక్షన్‌లోని ఠాణా సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతాల నుంచి కలప అక్రమంగా రవాణా కాకుండా ఇక్కడ చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. రాజమహేంద్రవరం - భద్రాచలం రహదారి 516ఈ జాతీయ రహదారిగా అభివృద్ధి చెందడంతో ఈ చెక్‌పోస్టుకు మరింత ప్రాధాన్యత ఏర్పడింది. ఇక్కడ ఇద్దరు సిబ్బంది విధులు నిర్వహిస్తారు. జిల్లాల పునర్విభజనలో భాగంగా ఇది రాజమహేంద్రవరం ఫారెస్టు రేంజ్ పరిధిలోకి వచ్చింది. ఈ మీదుగా వేలవాహనాలు రాకపోకలు సాగిస్తాయి. గతంలో ఈ రహదారి మీదుగా ఒడిశాకు తరలిస్తున్న తాబేళ్లకు ఇక్కడే సిబ్బంది పట్టుకున్నారు. అలాగే గంజాయిని తరలిస్తున్న వాహనాలను సీజ్ చేశారు.

వేణుగోపాలస్వామి గ్రామోత్సవం


బలభద్రపురంలో వేణుగోపాలస్వామి గ్రామోత్సవం

బిక్కవోలు: బలభద్రపురం రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి గ్రామోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సత్తి సత్యనారాయణ రెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో గరుడ వాహనంపై స్వామిని ఊరేగించారు.

అయ్యప్పస్వామి గ్రామోత్సవం

బిక్కవోలు: పందలపాకలో సంక్రాంతిని పురస్కరించుకుని అయ్యప్పస్వామి వారి గ్రామోత్సవం నిర్వహించారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో స్వామిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఉంచి ఊరేగించారు. సాయంత్రం మకరజ్యోతి దీపాన్ని వెలిగించి ఆకాశంలోకి వదిలారు. .

ఘనంగా కావిడి ఉత్సవం

పెదపూడి: జి.మామిడాడ నూకాలమ్మ, నేరేళ్లమ్మకు సంక్రాంతి సందర్భంగా కావిడి ఉత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. వివిధ ఆలయాలు, గృహాల నుంచి చలిమిడి, పానకాల కావిడిలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. వేద పండితులు రేజేటి వెంకట నరసింహాచార్యులు ఆధ్వర్యంలో అమ్మవార్లకు మంత్రోచ్చరణలతో శాస్త్రోక్తంగా అమ్మవారికి నివేదనలు సమర్పించారు. కార్యక్రమంలో నల్లమిల్లి సుబ్రహ్మణ్యేశ్వర రెడ్డి, మేడపాటి రామారెడ్డి, ద్వారంపూడి వెంకట రెడ్డి, ద్వారంపూడి ప్రభాకర్‌రెడ్డి, మేడపాటి సాయి బాబారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై దాడి చేసి 11 మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ పి.బుజ్జిబాబు తెలిపారు. వారి నుంచి రూ.30,020 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

గుండాట ఆడుతున్న ఇద్దరి అరెస్టు

బిక్కవోలు: పందలపాక గ్రామంలో గుండాట ఆడుతున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ పి.బుజ్జిబాబు తెలిపారు. వారి నుంచి గుండాట నంబర్ బోర్డు సామగ్రితో పాటు రూ.650 స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

సంక్రాంతి పోటీలతో వెలుగులోకి ప్రతిభ

పెదపూడి: సంక్రాంతి పోటీల కారణంగా గ్రామీణుల్లో ఉన్న ప్రతిభ, సృజనాత్మకత వెలుగులోకొస్తుందని చింతపల్లి గ్రామ నాయకుడు మద్దాల శ్రీసూర్యనారాయణ అన్నారు. చింతపల్లి చెరువు గట్టు రామాలయం వద్ద సంక్రాంతి సంబరాలు పురస్కరించుకుని మహిళలకు ముగ్గుల పోటీలు, కుర్చీలాట పోటీలు ఘనంగా నిర్వహించారు. ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలతో పాటు అందరూ ఆటలను ప్రొత్సహించాలని సూర్యనారాయణ కోరారు. న్యాయ నిర్ణేతలుగా బద్ద రాజేష్, చిరట్ల సూరిబాబు చౌదరి వ్యవహరించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

ప్రాచీన సంస్కృతి సంప్రదాయాలు పరిరక్షించాలి

పెదపూడి: గ్రామీణ ప్రాంతాల్లో సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన అవసరముందని ఫ్యామిలీ హెల్త్ క్లబ్ ముఖ్య కార్యదర్శి మండ రాజారెడ్డి అన్నారు. జి.మామిడాడ గ్రామంలో ఫ్యామిలీ హెల్త్‌క్లబ్ ఆవరణలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. స్లోసైక్లింగ్, టగ్ ఆఫ్ వార్, కుర్చీలాట పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలకు క్లబ్ అధ్యక్షుడు ద్వారంపూడి వెంకటరెడ్డి ఏర్పాటు చేసిన బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు ద్వారంపూడి దివాకర్‌రెడ్డి, కార్యదర్శి బ్రహ్మానందరెడ్డి, కోశాధికారి గంగాధర్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు సబ్బెళ్ల అప్పారెడ్డి (భీమ్), శివన్నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణారెడ్డిని అభినందించిన రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్


సబ్బెళ్ల కృష్ణారెడ్డిని అభినందిస్తున్న రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి

అనపర్తి: అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన సబ్బెళ్ళ కృష్ణారెడ్డికి రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి అభినందనలు తెలియజేశారు. సోమవారం గ్రామానికి విచ్చేసిన ఆయన గ్రామ సచివాలయంలో కృష్ణారెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా కాయల వెంకటరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో ఎన్ని అక్రమ కేసులు బనాయించినా, దౌర్జన్యాలు చేసినా కృష్ణారెడ్డి ఎదురొడ్డి పోరాడారని కొనియాడారు. వైఎస్సార్ సీపీ విజయంలో కీలకపాత్ర పోషించిన కృష్ణారెడ్డిని ఏఎంసీ చైర్మన్ పదవికి ఎంపిక చేసి సముచిత స్థానం కల్పించారన్నారు. ఇది నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ శ్రేణులకు దక్కిన గౌరవంగా భావించాలని చెప్పారు. వైఎస్సార్ సీపీ నాయకులు కాయల సూరారెడ్డి, సత్తి సత్యనారాయణరెడ్డి, సత్తి సుబ్బిరెడ్డిలు కృష్ణారెడ్డిని అభినందించిన వారిలో ఉన్నారు.

శనగ పంటకు మేలు చేస్తున్న పొగ మంచు


రంగంపేట మండలం చంద్రేడులో కళకళలాడుతున్న శనగ మొక్కలు

రంగంపేట: మండలంలో రైతులు సాగు చేసిన శనగ పంటకు పొగ మంచు మేలు చేస్తుంది. గత కొద్ది రోజులుగా మంచు, చలిగాలులు తీవ్రత ఎక్కువగా ఉండడంతో ఆ వాతావరణం శనగ పంటకు కలిసొచ్చింది. సాధారణంగా శనగ సాగుకు ఒకటి, రెండు నీటి తడులుంటే సరిపోతుంది. మంచు కారణంగా మొక్కలు ఎదుగుతాయి. మండల పరిధిలోని వడిశలేరు, రంగంపేట, చంద్రేడు, పెదరాయవరం గ్రామాల్లో రైతులు పత్తి, మినుము పంటలు సాగు చేయగా అవి ఆశించిన స్థాయిలో దిగుబడి లేక నష్టాలు మిగిల్చాయి. దీంతో వ్యవసాయ శాఖ 50 శాతం రాయితీపై 80 టన్నుల శనగ విత్తనాలు పంపిణీ చేయడంతో సుమారు 1260 ఎకరాల్లో రైతులు శనగను సాగుచేశారు. ప్రస్తుతం శనగకు వాతావరణం అనుకూలంగా ఉండడంతో పొలాల్లోని మొక్కలు ఆశాజనకంగా కనిపిస్తున్నాయి. కొన్ని చోట్ల ముందుగా వేసిన పొలాల్లో మొక్కల నుంచి పూత సైతం వస్తోంది.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

పెదపూడి: పెదపూడి మండలం రాజుపాలెం గ్రామంలో సంప్రదాయ సంక్రాంతి సంబరాలు కొనసాగించాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జీవీ రమణ పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడేందుకు ప్రయత్నించాడు. ఆ సమీపంలోనే ఉన్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి వెంటనే అప్రమత్తమై అతడి ఆత్మహత్య యత్నాన్ని అడ్డుకున్నారు. అక్కడే ఉన్న ఏఆర్ ఏఎస్పీ సత్యనారాయణ, కాకినాడ రూరల్ సీఐ శ్రీనివాస్‌తో ఎమ్మెల్యే మాట్లాడారు. సంప్రదాయ సంక్రాంతి సంబరాలు కొనసాగించాలని, ప్రజలకు ఇబ్బంది కలిగించొద్దని కోరారు. ప్రజలకు ఏమైనా జరిగితే పోలీసులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. సంబరాల్లో శాంతి భద్రతలకు భంగం కలిగితే ముందుగా తనను అరెస్ట్ చేయొచ్చని చెప్పారు. దీంతో అక్కడి నుంచి పోలీసులు వెళ్లిపోయారు.